క్లుప్తంగా

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌కు సన్మానం



మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

షాబాద్: గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు నవాజీపురం లింగం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో ఆయనను ముదిరాజ్ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కూర వెంకటయ్య, ముదిరాజ్ సంఘం నాయకులు మాసయ్య, జనార్దన్, శ్రీనివాస్, గౌరీశ్వర్, మల్లేశ్, వెంకటయ్య, చంద్రయ్య, యాదగిరి, ఆనందం, రవి ఉన్నారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీ



జిల్లాస్థాయి పోటీలో పాల్గొనే క్రీడాకారులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ షాద్‌నగర్ జోన్‌లోని క్రీడాకారులకు శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జిల్లాస్థాయి ఖోఖో పోటీలో పాల్గొనే విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులను అందజేశారు. అదేవిధంగా ఈనెల 20న తుక్కుగూడలో నిర్వహించే జిల్లాస్థాయి ఖోఖో పోటీలో అండర్ 14, 17 విభాగాల్లో క్రీడాకారులకు సొంత ఖర్చులతో ఎమ్మెల్యే రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, ఎంఈఓ మనోహర్, హెచ్‌ఎంలు పద్మశ్రీ, శైలజ, పీడీ బాలయ్య పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తూరు: పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి సల్మాన్ త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో అంగోర్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థి చిత్రలేఖనంలో చక్కని ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఫార్మసీ విద్యార్థులు కళాశాల ఎదుట నిరసన చేపట్టారు. శనివారం మండలంలోని అమ్డాపూర్ చౌరస్తాలో గల జేబీ ఫార్మసీ కళాశాల విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. గత రెండున్నర సంవత్సరాలుగా బకాయిలు పేరుకుపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ట్యూషన్, విద్యార్థుల నిర్వహణ ఫీజులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల నిరసనలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆత్మగౌరవ' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

తుర్కయంజాల్: ఈ నెల 27న నాగర్‌కర్నూల్‌లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆత్మగౌరవ పోరాట సభకు మాలలు తరలిరావాలని ఆ సంఘం రాష్ట్ర కోచైర్మన్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చెవుల దశరథ పిలుపునిచ్చారు. సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను వారు శనివారం తుర్కయంజాల్ అంబేడ్కర్ కూడలిలో ఆవిష్కరించారు.

దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఆలయ అభివృద్ధికి చెక్కు అందజేస్తున్న వెంకటేశం

షాద్‌నగర్: దేవాలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలికట్ట భవానీ మాత ఆలయానికి ఎమ్మెల్యే రూ.5లక్షలు విరాళం అందజేయగా, చౌడమ్మగుట్ట ఆలయానికి పట్టణానికి చెందిన ఆకుల వెంకటేశ్ తన కొడుకు కీ.శే ఆకుల రాఘవేందర్ జ్ఞాపకార్థం రూ.10లక్షల విరాళం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయం, ఎలికట్ట భవానీ మాత దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో ఆలయాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సదుపాయాలను కల్పిస్తామన్నారు. ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టిందని అన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకొని సన్మార్గంలో నడవాలని, భక్తితోనే ముక్తి లభిస్తుందన్నారు. ఆలయ పాలక మండలి సభ్యులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం ఆలయ ఆవరణలోని శ్రీకృష్ణగోశాలలో ఎమ్మెల్యే గోపూజ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కొంకళ్ల చెన్నయ్య, బాల్‌రాజ్‌గౌడ్, వెంకట్రామిరెడ్డి, విశాల, కృష్ణవేణి, అగ్గనూరు విశ్వం, భార్గవ్‌కుమార్‌రెడ్డి, కావలి శ్రీశైలం, బస్వం, తుపాకుల శేఖర్, ఎంసాని శ్రీనివాస్, నర్సింలు, రాయికల్ శ్రీను, పెద్ది రామ్మోహన్, అశోక్, యాదగిరి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అన్నివర్గాలకు న్యాయం

- పార్టీ మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి



ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

చేవెళ్ల: దేశాభివృద్ధిలో ప్రధాని మోదీ పాత్ర కీలకమని బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పాండురంగారెడ్డి, అనంత్‌రెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఇంటింటికీ తిరుగుతూ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేపట్టిన అనేక పథకాలు ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. బీజేపీతోనే అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరుగుతుందని వివరించారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదుకు 88000 02024 నెంబర్‌కి మిస్స్‌డ్ కాల్ ఇచ్చి మద్దతు తెలుపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సాయిరాం, శివ, ఇంద్రాసేనారెడ్డి, అశోక్, జయసింహా, శేఖర్‌రెడ్డి, గణస్త్రశ్, శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, శివకుమార్, తదితరులు ఉన్నారు.

గోపురం నిర్మాణానికి విరాళం



మాజీ ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాకార గోపురం నిర్మాణానికి శనివారం మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు రూ.1లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వారు విరాళానికి సంబంధించిన చెక్కును మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్, అప్పి, సాయీశ్వర్‌రెడ్డి, కానుగు భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

మొగిలిగిద్దలో..

మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయానికి గ్రామానికి అనుమారి పెంటయ్యగుప్తా, అనుమారి శ్రీనివాస్‌గుప్తాలు రూ.51వేల విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, అన్మారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

హోమియోపతి వైద్యంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కొత్తూరు: హోమియోపతి వైద్యంతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిమ్స్ హోమియోపతి ఆస్పత్రి, కళాశాలకు చెందిన వైద్యులు రమ్యకృష్ణ, లహరి అన్నారు. మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామంలో శనివారం వారి ఆధ్వర్యంలో ఎముకలు, కీళ్ల దినోత్సవం సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురికి సాధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎముకలు, కీళ్లకు వచ్చే వ్యాధులు, వాటి నివారణపై వైద్యులు మహిళలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలో గుర్తించి త్వరగా చికిత్సలు అందిస్తే చాలావరకు ప్రయోజనం ఉంటుందన్నారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు, ఆహారంలో నాణ్యత తగ్గడంతో పాటు పలు కారణాలతో చాలామంది దేశంలో ఎముకలు, కీళ్ల వ్యాధుల బారిన పడుతున్నట్లు వివరించారు. జన్యుపరమైన రుగ్మతలతో బాధపడే వారికి హోమియోపతిలో ఉన్నతమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి, వైద్యులు ఫాతీమా సుల్తానా, రుఖియా, అభినయ, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'విద్యతోనే ఉజ్వల భవిష్యత్'



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

మొయినాబాద్: విద్యార్థులు జీవితంలో వచ్చే ఒడిదుడుకులను ఎదుర్కొని ఉన్నత చదువులతో ముందుకెళ్లాలని ఏటీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సీఈఓ ఆర్యన్ శ్రీనివాస్ రాజ్‌పుత్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎంబీఏ విద్యార్థులు భవిష్యత్‌లో మంచి వ్యాపారవేత్తలుగా ఎదిగి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలన్నారు. నైపుణ్యం పెంచుకున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఝాన్సీ, మానస, మనిషారెడ్డి, మహేశ్వరి, సంగీతలకు బంగారు పతకాలతో పాటు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేజీరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎంఎస్ నర్సయ్య, అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలో చోటు కల్పించండి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి

మంచాల: ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీలో చోటు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు కావలి బుగ్గరాములు కోరారు. శనివారం నగరంలో పట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా పార్టీలో కొనసాగుతున్నానని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. రెండు పర్యాయాలు పార్టీ తరఫున సర్పంచ్‌గా పోటీ చేశానని వెల్లడించారు. కావున తనకు మార్కెట్ కమిటీలో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పండరినాథ్ గౌడ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



షాబాద్‌లో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ స్రవంతి



కొత్తూరు: రైతులకు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న పశువైద్యురాలు స్ఫూర్తి

మొయినాబాద్: పాడి పశువుల పోషణలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దమంగళారంలో పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని 328 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు ఎలాంటి రోగాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పద్మ, ప్రసన్నకుమార్, భీంరావ్, గోరెమియా తదితరులు పాల్గొన్నారు.

సీజనల్‌పై అప్రమత్తంగా ఉండాలి

కొత్తూరు: పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులు, వాటి వ్యాప్తిపై రైతులు, కాపరులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యురాలు స్ఫూర్తి అన్నారు. మండల పరిధిలోని పెంజర్ల, కొత్తూరు మున్సిపాలిటీలో శనివారం ఆమె ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాలను నిర్వహించారు. ఇందులో భాగంగా 292 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ, రవి, జ్యోతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

షాబాద్: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కుర్వగూడ, షాబాద్ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం గ్రామాల్లో 25 రోజుల పాటు జరుగుతుందన్నారు. రైతులు తమ పశువులకు విధిగా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



మొయినాబాద్: పెద్దమంగళారంలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి అహ్మద్

సదర్ సమ్మేళన సన్నాహక సమావేశం



సన్నాహక సమావేశంలో పాల్గొన్న యాదవ సంఘం నాయకులు

షాద్‌నగర్‌రూరల్: యాదవ సదర్ సమ్మేళన సన్నాహక సమావేశాన్ని శనివారం పట్టణ శివారులోని బైపాస్‌లో ఉన్న యమ్మీ హోటల్‌లో నిర్వహించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్య యాదవ్, గున్న భీమయ్య యాదవ్, సింగిల్ విండో డైరక్టర్ బక్కన్న యాదవ్, జంగ నర్సింలు యాదవ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. యాదవుల ప్రత్యేక ఉత్సవమైన సదర్ సమ్మేళనాన్ని ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహిస్తామన్నారు. సదర్ ఉత్సవాన్ని రాజకీయాలు, కుల మతాలకతీతంగా అందరూ కలిసికట్టుగా నిర్వహించి ఐక్యతను చాటాలన్నారు. సదర్ వేడుకల నిర్వహణ తేదీ, ఏర్పాట్ల విషయాన్ని చర్చించేందుకు ఈనెల 24న పట్టణంలోని హాజిపల్లి రోడ్డులో ఉన్న మల్లికార్జున ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10గంటలకు యాదవసంఘం నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాదవ సంఘం నాయకులు అధిక సంఖ్యలో విచ్చేసి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దంగు శ్రీనివాస్ యాదవ్, నడికూడ రఘునాథ్ యాదవ్, యాదగిరి యాదవ్, వెంకటేశ్‌యాదవ్, మల్లేష్ యాదవ్, తుమ్మల నర్సింలు, బాల్‌రాజ్ యాదవ్, శ్రీశైలం, శ్రీనివాస్ యాదవ్, అంబటి అంజి యాదవ్, లింగం యాదవ్, నడికూడ అశోక్, వెంకశ్‌యాదవ్, యాదయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మధురం.. సీతాఫలం

- పండులో పోషక విలువలు పుష్కలం
- అడ్డాగా మారిన సీతారాంపూర్
- పల్లెల నుంచి విక్రయానికి తీసుకొస్తున్న రైతులు

షాబాద్: మార్కెట్‌లోకి పేదోడి యాపిల్స్ వచ్చాయి. పోషక విలువలు పుష్కలంగా ఉన్న సీతాఫలం పండ్లు ప్రజలు ఎంతో ఇష్టంగా తింటారు. మండలంలోని సీతారాంపూర్ వద్ద కొంతమంది మహిళలు కుటుంబ పోషణ కోసం సీతాఫలాలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. షాబాద్, సీతారాంపూర్ దగ్గర పండ్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మారుతున్న పద్ధతులలో అడవులకు వెళ్లి పండ్లు తెచ్చుకొని తింటున్న వారు క్రమంగా తగ్గిపోతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు రైతులు, మహిళలు వాటినే జీవనోపాధిగా మార్చుకుంటున్నారు. సీజన్ సమయంలో కాస్తున్న పండ్లను అడవుల నుంచి తీసుకొచ్చి పట్టణ ప్రాంతాల్లో విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే వర్షాకాలం కావడంతో సీతాఫలం పండ్లకు బాగా డిమాండ్ ఏర్పడింది. దీంతో పలువురు రైతులు, మహిళలు కాయలు, పండ్లు తీసుకొచ్చి పట్టణం, మండల కేంద్రాల్లో, చౌరస్తాల దగ్గర రోడ్డుకిరువైలా కూర్చొని విక్రయిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సక్రమంగా పడకపోవడంతో ఆశించిన స్థాయిలో చెట్లకు కాయలు కాయలేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం పండ్లు చాలా తక్కువగా ఉండటంతో వాటికి బాగా డిమాండ్ ఏర్పడింది. ఒక చిన్నపాటి బుట్టకు రూ.200 నుంచి రూ.400వరకు విక్రయిస్తున్నారు.

సీతాఫలం అడ్డాగా సీతారాంపూర్

ప్రతి ఏడాది సీజన్‌లో వచ్చే పండ్లను అమ్మడానికి షాబాద్, సీతారాంపూర్ చౌరస్తాలు ప్రత్యేక అడ్డాలుగా మారాయి. మండలానికి చుట్టుపక్కన ఉన్న నరెడ్లగూడ, నాగర్‌కుంట, మాచన్‌పల్లి, కుమ్మరిగూడ, అంతారం, చర్లగూడ, తిర్మలాపూర్ తదితర గ్రామాల నుంచి రైతులు, మహిళలు పండ్లు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. పట్టణంలో సీజన్ పండ్లు కావాలంటే ఎవరైనా ఈ ప్రాంతానికి రావాల్సిందే. నిత్యం షాబాద్, సీతారాంపూర్‌లలో ఎక్కువ మంది మహిళలు సీతాఫలాలు విక్రయిస్తున్నారు. ఉదయం వేళలో ఆ రోడ్డు పూర్తిగా రద్దీగా కన్పిస్తోంది.



సీతారాంపూర్ చౌరస్తా వద్ద సీతాఫలాలు అమ్ముతున్న గ్రామస్తులు

అభివృద్ధికి సహకారం అందించాలి

- మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న దాత

చేవెళ్ల: దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని పామెన మాజీ సర్పంచ్ డి.గోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని పామెన గ్రామంలో నిర్మిస్తున్న వీరభద్రస్వామి దేవాలయ అభివృద్ధికి శనివారం వెంకటసాయి డెవలపర్స్ ప్రతినిధి రూ.3లక్షల 16వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో దేవాలయాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందన్నారు. దేవాలయాల నిర్మాణంలో ప్రతి ఒక్కరి సహకారం ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సత్యనారాయణచారి, నాయకులు బుచ్చప్ప, వరుణ్‌రెడ్డి, వినోద్‌కుమార్, బాబు, రాములు, కొమురయ్య, రవికుమార్, అంజయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

పిల్లల చదువుపై శ్రద్ధ చూపాలి

- మండల విద్యాధికారి రాందాస్

మంచాల: విద్యార్థులు క్రమ తప్పకుండా పాఠశాలకు రావాలంటే తల్లిదండ్రులు తగిన శ్రద్ధ చూపాలని ఎంఈఓ రాందాస్ అన్నారు. శనివారం రంగాపూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు నిత్యం బడికి వచ్చినప్పుడే ఉపాధ్యాయులు బోధించే పాఠాలు అర్థమవుతాయని పేర్కొన్నారు. టీచర్లు కూడా పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రగతిని సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అపార్ ఐడీ గురించి వివరించారు. నర్సరీ నుంచి పై చదువులకు సంబంధించిన సర్టిఫికెట్లు అన్ని అపార్ ఐడీ ద్వారా ఆన్‌లైన్‌లో పొందు పరుస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఐడీ కోడ్ నంబర్‌తో వాటిని చూసుకోవచ్చునని వెల్లడించారు. ఒకవేళ సర్టిఫికెట్లు పోయినా కోడ్ ద్వారా తిరిగి వాటిని పొందవచ్చని స్పష్టంచేశారు. కార్యక్రమంలో చీడేడ్, రంగాపూర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శంకర్, నిర్మల బాయి తదితరులు పాల్గొన్నారు.